సాక్షి రంగారెడ్డి

సోమవారం ౹ 21 ౹ ఆగస్టు ౹ 2023



ప్రత్యామ్నాయం బీజేపీయే..

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం బీజేపీయే అని మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాన కామత్ అన్నారు. 8లో▸



ప్రేమకు పెద్దల నిరాకరణ

ప్రేమకు బాలిక కుటుంబ సభ్యులు నిరాకరించడంతో యువకుడు నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. 8లో▸



దుకాణంలో అగ్నిప్రమాదం

మైలార్‌దేవ్‌పల్లి టాటానగర్ పారిశ్రామికవాడలోని ఓ పరుపుల తయారీ కేంద్రంలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. 8లో▸

న్యూస్‌రీల్

నేడు డ్రా పద్ధతిన మద్యం దుకాణాల కేటాయింపు

తుర్కయంజాల్: శంషాబాద్‌లోని మల్లికా కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 10 నుంచి డ్రా పద్ధతి ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు చేపట్టనున్నట్లు కలెక్టర్ హరీశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–2025 సంవత్సరాలకు గాను సరూర్‌నగర్ ఎక్సైజ్ యూనిట్‌లోని 134 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానించగా 10,994 వచ్చాయని తెలిపారు. ఎస్సీలకు 11, ఎస్టీలకు 2, బీసీలకు 25, జనరల్‌కు 96 దుకాణాలు కేటాయించినట్టు చెప్పారు. శంషాబాద్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 100 మద్యం దుకాణాలకు 10,621 దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ఎస్సీలకు 6, బీసీలకు 9, జనరల్ 85 కేటాయించినట్టు వివరించారు.

ఎల్‌బీనగర్-జేబీఎస్‌కు 'నాన్‌స్టాప్' సేవలు

హయత్‌నగర్: ఎల్‌బీనగర్- జూబ్లీ బస్‌స్టేషన్ (జేబీఎస్) రూట్‌లో రద్దీ సమయాల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ నాన్‌స్టాప్ బస్సు సర్వీసు(90ఎల్) సేవలను సోమవారం ఉదయం నుంచి ప్రారంభించనున్నట్లు హైదరాబాద్ రీజినల్ మేనేజర్ బి.వరప్రసాద్, డీఎం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5.10 నుంచి 6.30 వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. హయత్‌నగర్-2 డిపో, బండ్లగూడ డిపోల నుంచి 6 మెట్రో బస్సులు ఈ రూట్‌లో నడుపుతామన్నారు. టికెట్ ధర రూ.40 కాగా బస్‌పాస్‌లు చెల్లవని స్పష్టం చేశారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌శర్మ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలోని కళాశాలలో హిస్టరీ బోధన కోసం పార్ట్‌టైం ప్రాతిపదికన లెక్చరర్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం ఉండాలని, పీహెచ్‌డీ, నెట్ సెట్ చేసినవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 22న 4 గంటలలోగా తోల్‌కట్ట సమీపంలోని డిగ్రీ కళాశాలలో తమ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 82470 62851 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి




మౌనిక శుక్లాను సన్మానిస్తున్న ఇస్రత్ జైన్, స్వప్న తదితరులు

మొయినాబాద్‌రూరల్: సమాజంలో మానవ హక్కులను తెలుసుకొని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జాతీయ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషన్ పీఆర్‌వో సయ్యద్ ఇస్రత్ జైన్, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్, బీఆర్‌ఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న అన్నారు. అజీజ్‌నగర్ సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం జాతీయ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ కమిషనర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. సోషల్ వర్కర్స్‌గా పని చేసినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. అనంతరం హ్యూమన్ రైట్స్ మండల చైర్మన్‌గా మౌనిక శుక్లా, ప్రెసిడెంట్‌గా శ్రావికతివారీని నియమించి సన్మానించారు. కార్యక్రమంలో రవియాదవ్, స్వప్న, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య తెలంగాణ లక్ష్యం

వెంగళరావునగర్: ఆరోగ్య తెలంగాణను సాధించాలనే లక్ష్యంతోనే రాష్ట్రంలో కొన్నేళ్లుగా అనేక సంస్కరణలు చేపట్టామని మంత్రి హరీశ్‌రావు అన్నారు. వెంగళరావునగర్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో ఆదివారం ఆయన 108, 104, 102ల నూతన ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ (ఈఆర్‌సీ)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఎమర్జెన్సీ సేవలు మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్రంలో కేంద్రీకృత కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 102, 104, 108 హెల్ప్‌లైన్లు వేర్వేరుగా ఉన్నాయని, ఇకనుంచి హెల్ప్‌లైన్ సేవలు ఒకే స్థానం నుంచి ఆపరేట్ చేయాలని ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు.

ఆశా నిరాశేనా?



కల్వకుర్తి మినహా అన్ని చోట్ల మళ్లీ సిట్టింగ్‌ల పేర్లే ఖరారు!

- సందిగ్ధంలో ఆశావహులు.. పక్కచూపు చూస్తున్న నేతలు
- ప్రశ్నార్థకంగా ప్రతాప్‌రెడ్డి, టీకేఆర్, క్యామ, రత్నం, ముద్దగోని భవితవ్యం
- తాజాగా కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల

సాక్షి, రంగారెడ్డిజిల్లా: నేతల ఆశలపై గులాబీ అధిష్టానం నీళ్లు చల్లింది. వచ్చే ఎన్నికల్లో కల్వకుర్తి మినహా మిగతా అన్ని నియోజకవర్గాల్లో సిట్టింగ్‌ల పేర్లనే దాదాపు ఖరారు చేసినట్టు సమాచారం. దీంతో ఇప్పటి వరకు సామాజిక సేవా కార్యక్రమాల పేరుతో నిత్యం ప్రజల్లో ఉంటూ పార్టీ కోసం రూ.కోట్లు ఖర్చు చేసిన ఆశావహులంతా పునరాలోచనలో పడ్డట్టు తెలుస్తోంది. అవకాశం ఉంటే.. బీఆర్‌ఎస్‌ను వీడి.. మరో పార్టీలో చేరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని భావిస్తున్నట్లు వినికిడి. వీరి రాకను ప్రతిపక్ష పార్టీలు స్వాగతిస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయి నాయకుల నుంచి మాత్రం తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఏళ్ల తరబడి అధికారంలో లేకపోయినా.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థి లేకపోయినా.. పార్టీ జెండానే నమ్ముకుని పని చేస్తున్న వారిని కాదని, కొత్తగా ఇతర పార్టీల నుంచి వలస వచ్చే నేతలకు టికెట్లు ఇస్తే అంగీకరించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తుండటం విశేషం.

అంతర్మథనంలో ఆశావహులు..

- షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ఎలగనమోని అంజయ్య యాదవ్ పేరు దాదాపు ఖరారైంది. 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి రాజకీయ భవితవ్యం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికీ ఆయన తనకే టికెట్ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికే మళ్లీ చాన్స్ ఇవ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. సీఎం కేసీఆర్ ఆశీస్సులు తనకే ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో టికెట్ తననే వరిస్తుందని సీనియర్ లీడర్ క్యామ మల్లేశ్ చెప్పుకోవడం విశేషం.
- మహేశ్వరం నుంచి మంత్రి సబితారెడ్డి పేరు దాదాపు ఖరారైంది. కొంత కాలంగా మంత్రికి వ్యతిరేకంగా ధిక్కార స్వరం వినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఇకపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనేది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.
- రాజేంద్రనగర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేరు ఖరారైంది. ఈ సీటుపై ఆశలు పెట్టుకున్న ప్రస్తుత చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది.
- ఎల్బీనగర్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డికే మళ్లీ చాన్స్ ఇవ్వనున్నట్లు తెలిసింది. ఇక్కడి నుంచి టికెట్ ఆశించిన సీనియర్ నేత ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.
- చేవెళ్ల నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే కాలె యాదయ్య పేరు ఖరారు చేయడంపై మాజీ ఎమ్మెల్యే రత్నం రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మిగిలింది.
- శేరిలింగంపల్లి సిట్టింగ్ ఎమ్మెల్యే అరికపూడి గాంధీకే మళ్లీ అవకాశం కల్పించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

కల్వకుర్తిపై సందిగ్ధం

కల్వకుర్తి నియోజకవర్గంలో పార్టీ కేడర్ రెండు వర్గాలుగా చీలిపోయింది. సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి వర్గాలు ఒకరిపై మరొకరు బహిరంగ విమర్శలు చేసుకోవడమే కాదు ప్రత్యక్ష దాడులకు దిగిన సందర్భాలు లేకపోలేదు. ఇక్కడి నేతల తీరు సంస్థాగతంగా పార్టీకి ఇబ్బందికరంగా మారింది. దీంతో ఈ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోయే అభ్యర్థి పేరును అధిష్టానం పెండింగ్‌లో పెట్టింది. ఇదే సమయంలో తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌గుప్తాను పార్టీలోకి ఆహ్వానించింది. ఉప్పల ట్రస్ట్ పేరుతో ఆయన పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆయన్ను పార్టీలో చేర్చు కోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎవరు పోటీ చేయనున్నారనే అంశంపై ఇప్పటికీ అధిష్టానం స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.

వీర వనిత చాకలి ఐలమ్మ

మంత్రి సబితారెడ్డి



చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణలో మంత్రి సబితారెడ్డి తదితరులు

శంకర్‌పల్లి: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి ఐలమ్మ అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. మండలంలోని ప్రొద్దటూరులో ఆదివారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మహనీయుల త్యాగాలను గుర్తించి సముచితమైన గౌరవాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. భావితరాలకు వీరి చరిత్రలు తెలియజేయాలనే ఐలమ్మ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో 16 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రూ.32కోట్లతో మోడ్రన్ దోభీ ఘాట్లు నిర్మించడం జరుగుతోందన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగుతోందన్నారు. ఒకప్పుడు గ్రామాల్లో కరెంట్, తాగునీటి సమస్యలు ఉండేవని ప్రస్తుతం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను కాళేశ్వరం ప్రాజెక్టులా పూర్తి చేస్తారన్న నమ్మకం ప్రజల్లో పూర్తిగా ఉందన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ ఏనుగు నర్సింహారెడ్డి, ఎంపీటీసీ బొల్లారం ప్రవళిక, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ బొల్లారం వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల గౌరవ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కావలి గోపాల్, పీఏసీఎస్ చైర్మన్ పాపారావు, ఏఎంసీ చైర్మన్ బద్దం శశిధర్‌రెడ్డి, రజక సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధే మా విధానం

బడంగ్‌పేట్: సంక్షేమమే ధ్యేయం.. అభివృద్ధే తమ విధానమని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 28,29 డివిజనల్లో రూ.2.72 కోట్లతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ఆదివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రత్యేక చొరవతో మహేశ్వరం నియోజకవర్గం ఊహించనంతగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ట్రంక్‌లైన్లు, నాలాల నిర్మాణాలతో వరదముంపు పరిష్కారానికి చెక్ పెడుతున్నట్టు చెప్పారు. రూ.210 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా నూతన పైప్‌లైన్లు, ట్యాంకులు, రిజర్వాయర్లు నిర్మిస్తున్నామన్నారు. జల్‌పల్లి, బడంగ్‌పేట్, తుక్కుగూడ, మీర్‌పేట్ పరిధిలోని 11 చెరువులను రూ.47 కోట్లతో సుందరీకరణ పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, స్థానిక కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన కాంగ్రెస్ నాయకులు

మీర్‌పేట: దేశంలో అధునాతన టెక్నాలజీని తీసుకొచ్చిన ఘనత దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీకే దక్కుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అన్నారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం స్థానిక నాయకులు చల్లా బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. దేశానికి ప్రధానిగా రాజీవ్ గాంధీ ఎంతో సేవ చేశారని.. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు సిద్దాల శ్రీశైలం, కీసర యాదిరెడ్డి, దేవగోని కృష్ణ, వెంకటేశ్‌గౌడ్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ఎరుకల మురళిగౌడ్, ఐతరాజు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మోగింది కల్యాణవీణ

- శుభ ముహూర్తాలు షురూ
- ఇక బాజాభజంత్రీల హోరు
- పెళ్లి సంబంధ వ్యాపారాల జోరు
- డిసెంబర్ వరకు కల్యాణ ఘడియలు
- ఒక్కటి కానున్న వేలాది జంటలు



షాబాద్: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కల్యాణ ఘడియలు రానేవచ్చాయి. జూన్ 18 నుంచి ఇప్పటి వరకు ఆషాఢం, అధిక శ్రావణ మాసంతో శుభ ముహూర్తాలకు బ్రేక్ పడిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు ఈ నెల 19 నుంచి సుముహూర్తాలు తిరిగి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా పెళ్లి సందడి మొదలైంది. మండపాలు ముస్తాబయ్యాయి. పెళ్లి సామగ్రి కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడుతున్నాయి. శుభలేఖల ప్రింటింగ్ పనులు పూర్తి కాగా వంట, బాజాభజంత్రీల వారు, పురోహితులు అంతా సిద్ధమవుతున్నారు.

శుభముహూర్తాలు ఇలా..

- ఈనెల 19, 20, 22, 24, 26, 29, 30, 31.
- సెప్టెంబర్ 1, 2, 3, 6, 7, 8.
- అక్టోబర్ 18, 19, 20, 21, 22, 24, 25, 26, 27, 31.
- నవంబర్ 1, 2, 8, 9, 16, 17, 18, 19, 22, 23, 24, 25, 28, 29.
- డిసెంబర్ 3, 5, 6, 7, 8, 14, 15, 16, 17, 19, 20, 21, 24, 31 తేదీలు.

వ్యాపారాలు మళ్లీ కళకళ

రెండు నెలల పాటు శుభకార్యాలు పూర్తిగా లేకపోవడంతో ఆయా వర్గాల వ్యాపారులు ఎంతో నష్టపోయారు. ఈ నెల 19 నుంచి శుభ ముహూర్తాలు ఉండటంతో ఇప్పటికే జిల్లాలోని అన్ని ఫంక్షన్‌హాళ్లు ముందస్తుగా బుక్ అయ్యాయి. బంగారు, వస్త్ర దుకాణాలు, పెళ్లి సామగ్రి దుకాణాలు రద్దీగా మారాయి. ఈసారి ఎక్కువ ముహూర్తాలు ఉండటంతో వేద బ్రాహ్మణులు, బ్యాండ్ మేళం, సౌండ్ సిస్టం, లైటింగ్, డెకరేషన్, క్యాటరింగ్, వంటలు చేసేవారు, ఈవెంట్ ఆర్గనైజర్లు, వివిధ రకాల వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

5 నెలల్లో 52 శుభ ముహూర్తాలు..



జూన్ 18 నుంచి ఇప్పటి వరకు ఆషాఢం, అధిక శ్రావణంతో రెండు నెలల పాటు ముహూర్తాలకు నిలిచిపోయాయి. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 31 వరకు 52 శుభ ముహూర్తాలు ఉన్నాయి.


– శ్రీను పంతులు, షాబాద్

'ఎప్పుడొస్తావు.. నాయనా..'

- లద్దాఖ్ ప్రమాదంలో కొందుర్గు వాసి దుర్మరణం
- కన్నీరుమున్నీరైన కుటుంబసభ్యులు
- స్వగ్రామంలో విషాదఛాయలు



చంద్రశేఖర్ ఇంటివద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు



చంద్రశేఖర్ (ఫైల్)

కొందుర్గు: నిరుపేద కుటుంబం.. చిన్నతనం నుంచే దేశ సేవ చేయాలనే సంకల్పం.. ఆటుపోట్లను అధిగమిస్తూనే పదో తరగతి పూర్తయిన వెంటనే సైన్యంలో చేరాడు.. 12 ఏళ్ల పాటు దేశ సేవలో తరించాడు.. విధి చిన్నచూపు చూసింది.. ప్రమాదవశాత్తు లద్దాఖ్ వద్ద లోయలో పడిపోయిన సైనికుల వాహనంలో ప్రాణాలు వదిలాడు.. తొమ్మిది మంది సైనికులు ప్రాణాలు విడిచిన వీర జవాన్లలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం తంగెళ్లపల్లి పంచాయతీ పరిధిలోని తిరుమని దేవునిపల్లికి చెందిన నీరటి చంద్రశేఖర్ ఒకరు. విషయం తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

దేశ సేవ చేయాలనే తపనతో..

తిరుమని దేవునిపల్లికి చెందిన నీరటి లక్ష్మమ్మ, మల్లయ్య దంపతులది నిరుపేద కుటుంబం. వీరికి ముగ్గురు కుమారులు. ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ఇద్దరు కుమారులు వ్యవసాయం, కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు చంద్రశేఖర్(30) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదివాడు. 8 నుంచి 10వ తరగతి వరకు కొందుర్గులోని హాస్టల్‌లో ఉంటూ చదివాడు. దేశ సేవ చేయాలనే తపనతో పదో తరగతి పూర్తికాగానే 2010లో సైన్యంలో చేరాడు. 2017లో షాబాద్ మండలం కక్కులూర్ గ్రామానికి చెందిన లాస్యతో వివాహం జరిగింది. వీరికి వర్షిత (4), సహస్ర (2) ఇద్దరు కూతుళ్లు. పెళ్లయిన కొన్నాళ్లకే చంద్రశేఖర్ విధి నిర్వహణలో భాగంగా వెళ్లడంతో భార్య, పిల్లలు, తల్లి లక్ష్మమ్మ షాద్‌నగర్‌లో అద్దెకుంటూ పిల్లలను చదివించుకుంటున్నారు.

రెండు నెలల్లో వస్తానన్నాడు..

ఈ ఊడాది ఏప్రిల్‌లో తన బావమరిది పెళ్లికోసం వచ్చిన చంద్రశేఖర్ పదిహేను రోజులపాటు ఉండి వెళ్లిపోయాడు. వెళ్లే సమయంలో తిరిగి రెండు నెలల్లో వస్తానని తల్లి, భార్యాపిల్లలతో చెప్పాడు. ఇంతలోనే చంద్రశేఖర్ మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఎప్పుడొస్తావు.. నాయనా.. అంటూ చంద్రశేఖర్ తల్లి బోరున విలపించడంతో స్థానికులు కంటతడి పెట్టారు.

బాధిత కుటుంబానికి పరామర్శ..

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఆదివారం తిరుమని దేవునిపల్లి చేరుకొని చంద్రశేఖర్ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.



నేత్రపర్వం.. గంగ తెప్పోత్సవం



ఖైరతాబాద్: నగరంలో గంగ తెప్పోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. వేడుకలకు వందలాదిగా గంగపుత్రులు తరలివచ్చారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఖైరతాబాద్ ఏడు గుళ్ల నుంచి లైబ్రరీ చౌరస్తా మీదుగా ఐమాక్స్ నుంచి సాగర తీరంలోని గంగమ్మ ఆలయం వరకు ముందుకు సాగారు. అనంతరం గంగ తెప్పను సాగర్‌లో వదిలి అమ్మవారికి బోనాలను సమర్పించారు. గంగ తెప్పోత్సవ కమిటీ అధ్యక్షుడు మల్కు మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి పూస నరిసింహ సారథ్యంలో నిర్వహించిన శోభాయాత్రను బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐమాక్స్ వద్ద ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి పెద్ద ఎత్తున గంగ పుత్రులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జల నాగేష్, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, కార్పొరేటర్ విజయారెడ్డి, ఎన్జీఓ నాయకుడు జి. చందు, పూస నర్సింహ, చాట్ల సదానంద్, మంగళంపల్లి రాజు, మెట్టు ధన్‌రాజ్, కొప్పు పద్మ తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవ ఊరేగింపులో బోనాలతో వస్తున్న మహిళలు



బైక్‌ను ఢీకొట్టిన కారు

వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన బాలస్వామి

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్ మండలం సిలివేరుకు చెందిన బాలస్వామి ఆదివారం బైక్‌పై హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో కందుకూరు చౌరస్తా సమీపంలోని నవారు బాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్ ఎదుట ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బాలస్వామికి తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

వ్యక్తి అదృశ్యం


గోపాల్ (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: ఆరు బయట కూర్చున్న వ్యక్తి కనిపించకుండా పోయాడు. ఈఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన ప్రకారం.. వనం యాదమ్మ, గోపాల్ దంపతులు మండల పరిధిలోని గుంతపల్లిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల వీరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 15న తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో నిద్రలేచిన గోపాల్ ఇంటి ఎదుట కూర్చుని ఉండగా భార్య గమనించింది. మరో అరగంటకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో ఆమె గ్రామంలో, బంధువుల వద్ద వాకబు చేసినా అతని ఆచూకీ లభించలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పుష్కరిణిలో పడి వ్యక్తిమృతి


కిష్టయ్య మృతదేహం

చేవెళ్ల: ప్రమాదవశాత్తు పుష్కరిణిలో పడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి గ్రామానికి చెందిన నక్కలపల్లి కిష్టయ్య(61) పనినిమిత్తం మండల కేంద్రానికి వచ్చాడు. కాళ్లకు బురద అంటడంతో లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలోని పుష్కరిణిలో శుభ్రం చేసుకునేందుకు వెళ్లాడు. మెట్లపై కూర్చుని కాళ్లు కడుక్కునే క్రమంలో కాలుజారి పుష్కరిణిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే బయటకు తీసినా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌కు మేమే ప్రత్యామ్నాయం


షాద్‌నగర్: మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్‌ను సన్మానిస్తున్న నాయకులు


మొయినాబాద్: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప, బీజేపీ నాయకులు

- మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస కామత్
- కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యామ్నాయం బీజేపీయే అని మంగళూరు సౌత్ ఎమ్మెల్యే వేదవ్యాస కామత్ అన్నారు. ఆదివారం ఆయన బీజేపీ అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా షాద్‌నగర్ విచ్చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. దేశాభివృద్ధి ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించాలని సూచించారు. వచ్చే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో బీజేపీని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలను వివరించాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీయం కేసీఆర్ పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో షాద్‌నగర్‌లో కాషాయ జెండా ఎగురవేసేందుకు కలిసి కట్టుగా పని చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, దేపల్లి అశోక్, డాక్టర్ విజయ్‌కుమార్, అందె బాబయ్య, మిథున్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, కమ్మరి భూపాలాచారి, వెంకటేష్‌గుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, రుషికేష్, మహేందర్‌రెడ్డి, నాగరాజు, నర్సింహయాదవ్, సుధాకర్, శ్రీశైలం, వెంకటేష్ యాదవ్, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్నది బీజేపీ ప్రభుత్వం

మొయినాబాద్: తెలంగాణలో రానున్నది బీజేపీ ప్రభుత్వమని కర్ణాటక వలెంకెర్ ఎమ్మెల్యే ఎం చంద్రప్ప అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని రాహుల్ ఫాంహౌస్‌లో ఆదివారం బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 119 మంది ఎమ్మెల్యేలను రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలుగా నియమించింది. అందులో భాగంగా చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కర్ణాటక ఎమ్మెల్యే చంద్రప్ప ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 19 ఎస్సీ నియోజకవర్గాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగా చేవెళ్లలో ఈ నెల 23న అసెంబ్లీ బూత్ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కష్టపడి పనిచేస్తే చేవెళ్లలో గెలుపుఖాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. 23న నిర్వహించనున్న అసెంబ్లీ బూత్ సమ్మేళనాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా అసెంబ్లీ బూత్ సమ్మేళన వాల్‌పోస్టర్‌ను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గున్నాల గోపాల్‌రెడ్డి, క్యామ పద్మనాభం, రాజమల్లేష్, లక్ష్మిపతియాదవ్, శ్రీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో భారీగా వలసలు

మంత్రి సబితారెడ్డి

- బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరంలో బీఆర్‌ఎస్ జెండాను ఎగురవేసి సీఎం కేసీఆర్‌కు కానుక ఇస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అమీర్‌పేట్, మహేశ్వరం, సిరిగిరిపురం గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు మంత్రి సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపిస్తాయన్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా నియోజకవర్గంలో వందల కోట్ల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్‌ఎస్ గెలుపు ఆపలేవన్నారు. నియోజకవర్గంలో మెడికల్ కాలేజ్ ఏర్పాటు, 30 పడకల ఆస్పత్రి నూతన భవనం, డైట్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుతో పాటు ప్రతీ గ్రామంలో డబుల్ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. త్వరలో బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి భారీ ఎత్తున బీఆర్‌ఎస్‌కు వలసలుంటాయని చెప్పారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో మల్లేశ్, అంబేడ్కర్ యూత్ అమీర్‌పేట్ గ్రామ అధ్యక్షుడు సురేశ్, నర్సింహ, శ్రీకాంత్, సంజీవ, సిద్దులు, నర్సింహ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు అంబయ్య యాదవ్, రాయప్ప, చంద్రయ్య, అమీర్‌పేట్ ఉప సర్పంచ్ నర్సింగ్, బీఆర్‌ఎస్ యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఆదిల్, యూసుఫ్ పటేల్, వెంకటేశ్, రవి, రాజు, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.


మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

ప్రేమకు పెద్దల నిరాకరణ

- యువకుడి ఆత్మహత్యా యత్నం
- సకాలంలో స్పందించిన పోలీసులు


అజయ్‌రెడ్డికి చికిత్స అందిస్తున్న వైద్య బృందం

మీర్‌పేట: ప్రేమకు బాలిక కుటుంబ సభ్యులు నిరాకరించడంతో యువకుడు నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. హనుమాన్‌నగర్ రోడ్ నెం–3లో నివాసముండే జంపల్లి శ్రీరాంరెడ్డి స్థానికంగా బాయ్స్ హాస్టల్ నడిపిస్తున్నాడు. ఇతని కుమారుడు అజయ్‌రెడ్డి (23) దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఇనిస్టిట్యూట్‌లో సీఏ కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలిక(17), అజయ్‌రెడ్డిలు కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. వారం రోజుల క్రితం అజయ్‌రెడ్డి వీరి ప్రేమ విషయం బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో నిరాకరించారు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు ఆదివారం సాయంత్రం తన బైక్‌పై బడంగ్‌పేట్ శివారు షరీఫ్‌నగర్‌లోని నిర్మానుష్యప్రాంతానికి వెళ్లి నిద్రమాత్రలు వేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సెల్ఫీ వీడియో తల్లికి వాట్సాప్ చేశాడు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సెల్‌ఫోన్ లొకేషన్ ద్వారా పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న అజయ్‌రెడ్డిని హుటాహుటిన మంద మల్లమ్మ చౌరస్తాలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఏజీవర్సిటీ: విశ్వవిద్యాలయాలలో ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ హార్టీకల్చరల్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (తూటా) నిరంతరం కృషి చేస్తుందని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ చీనా నాయక్ అన్నారు. ఆదివారం రాజేంద్రగనర్‌లోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో (తూటా) అధ్యక్షుడి అధ్యక్షతన జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రం నలుమూలల నుంచి ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలలో, పాలిటెక్నిక్ కళాశాలలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, పరిశోధన స్థానాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ పాల్గొని తమకు ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా తూటా అధ్యక్షుడు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో విద్యా, పరిశోధన విస్తరణల ప్రధాన అంశంగా జరుగుతున్న అభివృద్ధిలో ప్రతి సభ్యుడి పాత్ర ఎంతో కీలకమని మన యూనివర్సిటీని దేశంలోనే అన్ని విశ్వవిద్యాలయ కంటే దీటుగా ముందుకు తీసుకెళ్లె సత్తా మన సభ్యులందరికీ ఉందని అన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ సూరేష్ కుమార్, ప్రశాంత్, లక్ష్మీనారాయణ, అనిత, పిడిగం సైదయ్య, వెంకటలక్ష్మి, పీత్రం గౌడ్, రాజాగౌడ్, జ్యోతి, వీనాజోషి, డాక్టర్ సాయి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

శంషాబాద్: రక్తదానంతో ప్రాణదానంతో సమానమని లిమ్స్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ రామరాజు అన్నారు. పట్టణంలోని తొండుపల్లి ప్రభవ ఎన్‌క్లేవ్‌లో జీవన్ రక్ష బ్లడ్ బ్యాంకు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యువత రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహ తొలగిపోవాలన్నారు. శంషాబాద్ పట్టణంలో మొట్టమొదటి సారిగా బ్లడ్ బ్యాంకును ప్రారంభించడం రోగులకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్మిత, డాక్టర్ యశోధర, డాక్టర్ శ్యాంసుందర్, శంకర్‌రెడ్డి, గోవర్ధన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సంతకం ఫోర్జరీ

ఇద్దరిపై కేసు

బంజారాహిల్స్: రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సంతకాన్ని ఫోర్జరీ చేసి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలంటూ సంగారెడ్డి కలెక్టర్‌కు లెటర్‌హెడ్‌పై సిఫారసు లేఖ అందించిన ఇద్దరి వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం నర్రెగూడం గ్రామానికి చెందిన ఎం.డి.గౌస్ పాషా, గుంటి శేఖర్ ఇటీవల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ లెటర్‌హెడ్ తయారు చేసి సంగారెడ్డి కలెక్టర్‌కు డబుల్ బెడ్రూం ఇళ్లు అలాట్ చేయాల్సిందిగా లేఖ అందించారు. ఫేక్ లెటర్‌తో ఈ నేరానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా మంత్రి ఓఎస్డీ డాక్టర్ ఎస్.ఎం.రాజేశ్వర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గౌస్‌పాషా, గుంటి శేఖర్‌లపై ఐపీసీ సెక్షన్ 499, 420, 464, 468, 471 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అత్యుత్సాహం సరికాదు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- బాధితురాలు లక్ష్మిని పరామర్శించిన నేతలు


లక్ష్మిని పరామర్శిస్తున్న ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్

బడంగ్‌పేట్: తప్పు చేసిన పోలీసులు మరో తప్పు చేసి బక్షక బటులని నిరూపించుకున్న పాలన కేసీఆర్ ప్రభుత్వంలోనే జరుగుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఆదివారం ఆయన ఎల్‌బీనగర్ పోలీసుల అత్యుత్సాహానికి బలైన బాధితురాలు లక్ష్మిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్‌పీ మాట్లాడుతూ.. విషయం తెలుసుకోకుండా ఒక గిరిజన బిడ్డపై ఇంతా దారుణంగా వ్యవహరిస్తారా? అని పోలీసులపై మండి పడ్డారు. కర్మన్‌ఘాట్‌లో చికిత్స పొందుతున్న బాధితురాలిని అర్ధరాత్రి హుటాహుటిన 200మంది పోలీసులతో వచ్చి బలవంతంగా వేరే ఆస్పత్రికి తరలించడం వెనక ప్రభుత్వం, పోలీసుల తప్పు స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఈ ఘటన పోలీసు వ్యవస్థకే మచ్చ అన్నారు. లక్ష్మిపై దారుణంగా హింసించిన పోలీసులను డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు.

రూ.50వేల ఆర్థికసాయం

విషయం తెలుసుకున్న బీజేపీ మహేశ్వరం నియోజకర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆదివారం బాధితురాలిని పరామర్శించారు. అయాయక గిరిజన మహిళపై దాడికి పాల్పడిన పోలీసులను సొసైటీలోనే తిరగనివ్వవద్దని అన్నారు. పోలీసులు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం బాధితురాలు లక్ష్మి ఆస్పత్రి ఖర్చులకు రూ.50వేలు అందజేశారు.

ప్రైవేట్ టీచర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా జార్జ్‌పాల్


నియామక పత్రం అంజేస్తున్న మంత్రి సబితారెడ్డి

పహాడీషరీఫ్: తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం ప్రైవేట్ టీచర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎడ్ల జార్జ్‌పాల్ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీయూఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు, ప్రైవేట్ టీచర్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్ కార్తీక్‌లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో అతనికి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జార్జ్ పాల్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు. యూనియన్ నాయకులతో కలిసి కార్యక్రమాలు చేపడుతానన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

- మెరైన్‌లో ఉద్యోగం అని మాయమాటలు
- నగరవాసి నుంచి రూ.4 లక్షలు వసూలు
- ఇద్దరు నైజీరియన్లను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: మ్యాట్రిమోనిలో నకిలీ ప్రొఫైల్స్ పెట్టి, పెళ్లి చేసుకుంటానని యువతులను మోసం చేస్తున్న ఇద్దరు నైజీరియన్లను రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇద్దరు నైజీరియన్లు గూగుల్‌లో నుంచి హ్యాండ్‌సమ్ అబ్బాయిల ఫొటోలను డౌన్‌లోడ్ చేసి, వాటి ద్వారా సామాజిక మాధ్యమాలలో నకిలీ ప్రొఫైల్‌లు సృష్టించారు. ఈక్రమంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని ఓ యువతికి ఇన్‌స్టాగామ్‌లో పరిచయం అయ్యాడు. మెరైన్‌లో ఉద్యోగం చేస్తున్నానని, నెలకు రూ.3 లక్షలు వేతనం అని మాయమాటలు చెప్పాడు. తక్కువ కాలంలోనే ఇరువురి మధ్య స్నేహం బలపడింది. ప్రతి రోజు ఇన్‌స్టాగామ్‌లో చాటింగ్ చేసుకునేవారు. ఈక్రమంలో తనను పెళ్లి చేసుకుంటానని సైబర్ మోసగాడు యువతితో చెప్పాడు. త్వరలోనే హైదరాబాద్‌కు వస్తానని నమ్మించాడు. మర్నాడు ఉదయం ఫోన్ చేసి నీ కోసం బంగారం బహుమతిగా తీసుకొస్తున్నానని చెప్పాడు. అయితే ఢిల్లీ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని చెప్పాడు. కస్టమ్స్ అధికారులతో మన ప్రేమ, పెళ్లి గురించి చెప్పానని, రూ.4 లక్షలు డబ్బులు ఇస్తే గిఫ్ట్ వదిలేస్తామని చెప్పారని వివరించాడు. లేకపోతే కేసులైతే ఉద్యోగం చిక్కుల్లో పడుతుందని, పెళ్లి ఆగిపోతుందని నమ్మించాడు. దీంతో అతని మాటలను పూర్తిగా విశ్వసించిన బాధితురాలు అతను అడిగిన డబ్బును ఆన్‌లైన్‌లో బదిలీ చేసింది. అంతే అప్పట్నుంచి ఫోన్ స్విచాఫ్. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులు ఢిల్లీలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఢిల్లీకి వెళ్లిన ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, రాజు బృందం.. ఇద్దరు నైజీరియన్లను అరెస్టు చేసి, స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచారు. ట్రాన్సిట్ వారెంట్‌పై నిందితులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి, రిమాండ్‌కు తరలించారు.

పరుపుల దుకాణంలో అగ్నిప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి టాటానగర్ పారిశ్రామికవాడలోని ఓ పరుపుల తయారీ కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలో గోదాములోని నాలుగు వైపుల మంటలు వ్యాపించడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అత్తాపూర్, బహదూర్‌పురా, లంగర్‌హౌజ్ ఫైర్ సిబ్బందిని ఘటన స్థలానికి రప్పించి రెండు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పారు. నగానికి చెందిన ఫయీం అనే వ్యక్తి ఈ పరుపుల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి గోదాముకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున గోదాము నుంచి దట్టమైన పొగలు, మంటలు వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనలో రూ.15 లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు వెల్లడించారు.